క్లుప్తంగా

ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలి



నేషనల్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న జీఎస్‌ఆర్ పాఠశాల ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని అప్పుడే ఉత్తీర్ణత సాధించగలరని నేషనల్ పాఠశాల విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని జీఎస్ఆర్ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భయపడకుండా మనస్సు ప్రశాంతంగా ఉంచుకొని పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఆత్మ విశ్వాసం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఫణి కుమార్, పాఠశాల హెచ్‌ఎం. విజయ కుమార్, ఇన్‌చార్జ్ అనిల్, జీఎస్‌ఆర్ పాఠశాల హెచ్‌ఎం సత్య తదతరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల సీఐగా విజయ భాస్కర్



గోనెగండ్ల : సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విజయ భాస్కర్ గురువారం సాయంత్రం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న ఏ.గంగాధర్ కర్నూలు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. నంద్యాలలో వీఆర్‌లో సీఐగా పని చేస్తున్న ఓ.విజయ భాస్కర్‌ను ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. సీఐ ఓ. విజయ భాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూస్తామని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.


దివ్యాంగురాలికి ఆర్థిక సాయం



దివ్యాంగురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న మల్లెల గ్రూప్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కలుగొట్ల రోడ్డులో దివ్యాంగురాలైన శ్యామల పండ్ల వ్యాపారానికి ఆల్‌ఇండియా క్రిష్టియన్ కౌన్సిల్ రాష్ట్ర సభ్యుడు, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్ రాజు తనయుడు మల్లెల జీవన్ సుశీల్ గురువారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. శ్యామల తల్లిదండ్రులు అనారోగ్యపాలు కావడంతో పింఛన్ సొమ్ముతో జీవనం ఇబ్బందిగా మారడంతో ఆర్థిక సాయం అందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కదిరికోట ఆదెన్న, మల్లె గ్రూప్ సభ్యులు యూకే బాబు, మహేష్, గంగాధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ల్యాబ్ టెక్నీషియన్స్ డే



ఆసుపత్రిలో కేక్‌కట్ చేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

ఎమ్మిగనూరుటౌన్: ల్యాబ్ టెక్నీషియన్స్ దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం ల్యాబ్‌టెక్నీషియన్లు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు బాలజీకుమార్‌తో కలిసి ల్యాబ్ టెక్నీషియన్లు కేక్‌కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ రోగ నిర్ధారణ సంబంధించి ల్యాబ్‌టెక్నీషియన్‌లే కీలకమన్నారు.

దర్గాలో భక్తుల సందడి



ఖాదర్‌లింగస్వామి దర్గాలో ప్రార్థన చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రంజాన్ మాసం కావడంతో భక్తులు దర్గాలోనే ఇఫ్తార్ చేపట్టారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

అందని వేతనం

జీవనం దుర్భరం

- ఉపాధి కూలీలకు రెండు నెలలుగా అందని వేతనాలు
- పెండింగ్ వేతనాలు రూ.కోటి
- ఆందోళనలో ఉపాధి కూలీలు
- తప్పని వలసలు
- వేడుక చూస్తున్న కూటమి ప్రభుత్వం

నందవరం: రెక్కలు విరిగేలా చెమటోడ్చినా కష్టార్జితం చేతికందని దౌర్భాగ్యం. అసలే వ్యవసాయం పనుల్లేక రైతులు, రైతు కూలీలు వలస బాటన సాగిపోతున్నారు. ఊళ్లకు ఊళ్లే ఖాళీ అవుతున్నాయి. ఏదో ఊరిలో కాసుకుని ఉన్న రైతు కూలీలకు ఉపాధి పనులు కాస్త ఊరటగా నిలిచాయి. అయితే ఆ కూలీలకు కూడా వేతన కష్టాలు తప్పడం లేదు. నెలలుగా ఉపాధి వేతనాలు పెండింగ్‌లో పెట్టారు. అరకొర ఉన్న కూలీలకు కూడా వేతనాలు మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. కారణంగా ఉపాధి కూలీలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

16,400 మంది పనులకు హాజరు

మండలంలో వ్యవసాయ పనులు మృగ్యం కావడంతో కూలీలకు ఉపాధి పనులే శరణ్యమయ్యాయి. పనితగ్గ వేతనం రాకపోయినా వ్యవసాయ కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. మండలంలో మొత్తం 35, 807 జాబ్ కార్డులు కలవు. అందులో 13,216 యాక్టివ్ జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుతం పనులకు దాదాపు 16,400 మంది పనులకు హాజరవుతున్నారు. అయితే స్వేదం చిందించినా సరైనా సమయానికి వేతనాలు మంజూరు కావడంలేదు. మండలంలో ఇప్పటి వరకు రూ.కోటి వేతనాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. అలాగే మండలంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మినీ గోకులాలు మెటీరియల్ కాంపోనెంట్ బిల్లు రూ.1.88 కోట్లు బకాయిలో ఉంది. వేతనాల కోసం కూలీలు ఎదురుచూపులు చూస్తున్నారు. వేతనాలు రాకపోవడంతో కుటుంబాలు గడవక నానా అవస్థలు పడుతున్నారు.

ఉపాధిపై సన్నగిల్లుతున్న నమ్మకం

మండలంలో అధికారుల లెక్క ప్రకారం 35 వేలకు పైగా వ్యవసాయ కూలీలు ఉన్నారు. పంటలు లేకపోవడంతో వ్యవసాయ పనులు కరువయ్యాయి. దీనికి తోడు ఉపాధి వేతనాలు సరైన సమయానికి చేతికందకపోవడంతో ఉపాధిపై కూలీలకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఉపాధి పనిలో కనీసం వేతనం కూడా లభించకపోడంతో పనులపై కూలీలకు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటికే మండలంలో దాదాపు 10 వేల కుటుంబాలకుపైగా వలస వెళ్లినట్లు అంచనా. ముఖ్యంగా కనకవీడు, సోమలగూడూరు, మిట్టసోమాపురం, నాగలదిన్నె, నందవరం, పూలచింత, మాచాపురం, నది కై రవాడి గ్రామాల నుంచి అత్యధికంగా వలస వెళ్లారు. బెంగుళూరు, హైదరాబాద్, ముంబాయి, గుంటూరు ప్రాంతాలకు తరలిపోయారు. కూలీలతో పాటు దాదాపు 3 వేలకుపైగా రైతు కుటుంబాలు సైతం వలస వెళ్లడం శోచనీయం.

గ్రామాలకు గ్రామాలు వలస

రైతులు, రైతు కూలీలు సాగు చేసిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, దిగుబడులు రాక నష్టాల ధాటికి విలవిల్లాతున్నారు. నందవరం మండల ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. మండలంలో దాదాపు 40 వేల ఎకరాల సాగుభూమి ఉంది. 70 శాతం భూములు వర్షాధారంతోనే పంటలు పండిస్తారు. ఈ ఏడాది చీడపీడలు, తెగుళ్లతో సరైన దిగుబడులు లేవు. దీనికి తోడు గిట్టుబాటు ధరలు లేని కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొలాల్లో పంటలు లేక వ్యవసాయ కూలీలకు ఉపాధి కరువై దిక్కులు చూస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ఆదుకోలేకపోవడం, చేసిన పనులకు సరైన సమయంలో వేతనాలు అందకపోవడం, కూలీలు గిట్టుబాటు కాకపోవడంతో వలస మార్గాన కూలీలు తరలిపోతున్నారు. వలస జాతరతో ఊళ్లకు ఊళ్లు ఖాళీ అవుతున్నా అధికారుల్లో కదలిక లేకపోయింది.



నందవరంలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

రెండు వారాల్లో ఉపాధి వేతనాలు



ఉపాధి కూలీల పనిదినాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేశాం. సాంకేతికంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూస్తున్నాం. అయితే నిధులు మంజూరు కాకపోవడంతో 2 నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉన్నతాధికారులకు సమస్యను వివరించగా నెలాఖరులోగా వస్తాయని సెలవిస్తున్నారు. నిధులు రాగానే రెండు వారాల్లో ఉపాధి కూలీలకు వేతనాలు మంజూరు చెస్తాం.

– శ్రీనివాసులు, ఏపీవో, నందవరం

ఎనిమిది వారాలుగా వేతనం అందలేదు



పొలం పనుల్లేక ఉపాధి పనులను నమ్ముకుని కూలీకి వెళ్లాం. 8 వారాలు పనులు చేసినా ఇప్పటి వరకు చిల్లిగవ్వ చేతికందలేదు. కుటుంబం పోషించుకోవడం కష్టంగా మారింది. అధికారులు ఎంతగా అడిగినా నిధులు రాలేదని చెబుతున్నారు. ఉపాధి పనులపై నమ్మకం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి కూలీలకు వేతనాలు చెల్లించాలి.

– బోయ కాసీం, ఉపాధి కూలీ, హాలహర్వి

ఇల్లు గడవడం కష్టమైంది



మేమంతా కాయాకష్టాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాం. మా కుటుంబంలో నలుగురు ఉపాధి పనులకు వెళ్లాం. 9 వారాలుగా వేతనాలు రాలేదు. ఇల్లు గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఉపాధి కూలీలపై చిన్నచూపు చూస్తోంది. వెంటనే నిధులు మంజూరు చేసి కూలీలు చెల్లించి ఆదుకోవాలి.

– తిమ్మయ్య గౌడ్, ఉపాధి కూలీ, నందవరం

డిజిటల్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

కౌతాళం: డిజిటల్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ అశోక్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎరిగేరి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు చెడు వ్యసనాలు, డిజిటల్ మోసాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా వివిధ అంశాలను వివరించారు. ప్రస్తుత టెక్నాలజీ అభివృద్ధి చెందడంతో పాటు కొంతమంది దీనిని చెడు మార్గాలలో ఉపయోగించుకుని నేరస్తులుగా మారుతున్నారని, ఇందుకు కారణం చెడు వ్యసనాలు, చెడు స్నేహాలే కారణమన్నారు. సెల్‌ఫోన్‌లను సరైన పద్ధతిలో ఉపయోగించుకోకుండా బంగారు భవిష్యత్తును చేజేతులారా నాశనం చేసుకుని నేరస్తులుగా మారుతున్నారన్నారు. ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రదానంగా 10వ తరగతి విద్యార్థులు ఒత్తిడి లేకుండా ఎలా ఉత్తీర్ణత సాధించాలో మెలకువలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్‌నాయుడు, ఉపాధ్యాయులు రామకృష్ణుడు, వెంకటేశ్వర్లు, రాము, శ్రీనివాసులు, బీరప్ప, జ్ఞానేశ్వరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో 'క్లీయ మెథడ్' ఏర్పాటు చేయాలి

ఆదోని అర్బన్: ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల కోసం క్లీయ మెథడ్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ పట్టణాధ్యక్షులు బసాపురం లింగప్ప, నాయకులు అంజిత్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ పట్టణ కోశాధికారి శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో కిడ్నీ సమస్యలతో డయాలసిస్ చేసుకోవడానికి వచ్చే రోగులకు రక్త పరీక్షకై బయట ల్యాబ్‌లో చేసుకోరావాలని చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. ఎందుకని ప్రశ్నిస్తే ఇక్కడ పరీక్షలు సరిగా చేయరని, బయట చేయించుకునే రావాలని చెప్పడం గమనార్హమన్నారు. అనంతరం ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ పద్మకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ సీనియర్ నాయకులు రమేష్, పట్టణ నాయకులు లింగప్ప, వినయ్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలే చిరకాలం గుర్తుంటాయి



సీఐ గంగాధర్ ను సన్మానిస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐ విజయ భాస్కర్

గోనెగండ్ల : ఉద్యోగి ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు అన్నారు. గోనెగండ్ల మండలం సీఐగా పనిచేస్తున్న గంగాధర్ కర్నూలుకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా గురువారం సాయంత్రం గోనెగండ్ల పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ, పోలీసులు, మండల ప్రజలు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు గాను సీఐ గంగాధర్ ఎంతో కృషి చేశారన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో కలిసిమెలిసి సమస్యలను పరిష్కరించే వారని కొనియాడారు. కార్యక్రమంలో నూతన సీఐ విజయభాస్కర్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసులు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, లక్ష్మీకాంత్, రమేష్, కుమార్, మద్దిలేటి, మండల ప్రజలు పాల్గొన్నారు.

క్షయవ్యాధి నివారణపై అవగాహన




మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఎస్ బాబురాజు

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: ఆదోని పురపాలక ఉన్నత పాఠశాలలో జాతీయ క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ఎంపీహెచ్ఎస్ బాబురాజు గురువారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కువ కాలం దగ్గు, గల్ల పడుతుంటే వెంటనే గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. క్షయవ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతినిఅడ్డుగా పెట్టుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యాధి నివారణ కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా మందులు అందజేయడంతో పాటు వారి పోషకాహారం కోసం ప్రతినెలా రూ.1000 అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున, ఉపాధ్యాయులు నాగరాజు, రవి, షరీఫ్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని సీఐటీయూ తాలూకా కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ బ్యాంకుల్లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24, 25 తేదీల్లో బ్యాంక్ ఉద్యోగులు చేపట్టనున్న సమ్మె కరపత్రాలను స్థానిక ఎస్‌బీఐ ఉద్యోగులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంక్‌ల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయక తాత్కాలిక ఉద్యోగులను నియమిస్తోందన్నారు. ప్రజలకు, ఖాతాదారులను దేశవ్యాప్తంగా ఎన్నో రకాల సేవలందిస్తున్న బ్యాంక్‌ల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ ఉద్యోగులు చేపట్టే సమ్మెకు ప్రజలు, వ్యాపారులు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు.

ఖోఖో పోటీల విజేతలకు బహుమతులు



బాలికల జట్టు విజేతకు కప్ అందజేస్తున్న పీడీలు,ఉపాధ్యాయులు

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం గ్రామంలో గ్రామ దేవత సుంకులమ్మ దేవరను పురస్కరించుకుని గ్రామ ఉద్యోగస్తుల సంఘం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో కోసిగి హైస్కూల్ హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, పీడీలు రాజారాం, రామచంద్రల సహకారంతో పోటీలు ప్రారంభించారు. డివిజన్ పరిధిలో 14 జట్లు పాల్గొన్నాయి. ఇందులో బాలుర విభాగంలో బాలుర హైస్కూల్ ప్రథమ బహుమతి, వందగల్లు జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో పెద్ద తుంబళం ప్రథమ స్థానం, కేజీబీవీ పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు కప్‌లను బహుమతుగా అందజేశారు. గ్రామ ఉద్యోగస్తులు వీఆర్వో బసవరాజు, తిక్కయ్య, జి. బసవరాజు, చెన్నబసవ, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఒంటిపూట బడులు

గోనెగండ్ల : శనివారం నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ-2 నీలకంఠ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలన్నారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల వేళలు ఉంటాయన్నారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రాలు గల పాఠశాలలు మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు. పాఠశాల సమయం ముగిసిన తరువాత విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

రేపు 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

ఆదోని టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి మూడో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ గురువారం తెలిపారు. ఆదోని పట్టణంలోని 42వ వార్డులో మూడో శనివారం రోజున స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు పాల్గొని పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. రోడ్లపై పడిన చెత్తాచెదారాన్ని తీసివేసి ప్రజలకు స్వచ్ఛాంధ్ర గురించి వివరిస్తారన్నారు.

పౌష్టికాహారం అందించాలి

నందవరం : అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని కనకవీడు పేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాగడుతూ.. చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. అలాగే గ్రామంలో ఉపాధి హామీ నిధుల కింద మంజూరైన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.


బీసీ హాస్టళ్లు ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే విద్యాసంవత్సరంలోగా పట్టణంలో బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఉన్న పాఠశాలల్లో గ్రామీణ విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారని, వారికి హాస్టల్ సౌకర్యాలు లేక ఇబ్బందుకు పడుతున్నారన్నారు. గ్రామీణ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వచ్చే విద్యాసంవత్సరం ఆయా హాస్టళ్లను ప్రారంభించాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

కౌతాళం: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు పది వారాల నుంచి వేతనాలు అందక పోవడంతో వస్తులుండాల్సిన పరిస్థితి వచ్చిందని సీపీఐ మంత్రాలయ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భాస్కర్‌యాదవ్ తెలిపారు. గురువారం ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరుతూ తసహీల్దారుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు మజ్జిగా ప్యాకెట్లు అందించాలని, పనులు గ్రామానికి 2కిలోమీటర్ల దూరంలో ఉంటే కూలీలకు రవాణ సౌకర్యం కల్పించాలని, దినసరి వేతనం 6వందలకు తగ్గకుండా ఇవ్వాలని డిమాండు చేశారు. వేతనాలను వేంటనే చేల్లించక పోతే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట మండల కార్యదర్శి ఈరన్న, వెంకటేశ్వర్లు, శ్రీనివాసలు ఉన్నారు.

ఆల్ ఇండియా 199వ ర్యాంకు



వంశీకృష్ణారెడ్డి

పెద్దకడబూరు : మండల కేంద్రానికి చెందిన వెంకటరామిరెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షలో ఆల్ ఇండియా 199వ ర్యాంకు సాధించాడు. టైర్ - 1 పరీక్షలలో 18,13,060 మంది పాల్గొని పరీక్షలు రాయగా, టైర్ -2 పరీక్షలకు 1,86,509మంది ఎంపిక అయ్యారు. వారిలో 199వ ర్యాంకు సాధించిన వంశీకృష్ణారెడ్డి ఇన్‌కమ్‌ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వంశీకృష్ణారెడ్డికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

బి.అగ్రహారంలో దాహం దాహం..



పంటపొలాల నుంచి మంచినీటిని తీసుకువస్తున్న అగ్రహారం గ్రామస్తులు

గోనెగండ్ల: మండల పరిధిలోని బి. అగ్రహారం గ్రామంలో గత వారం రోజులుగా తాగునీటి సమస్య ఉండటంతో గ్రామస్తులు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు గ్రామ శివారులోని పంట పొలాల బోరు బావులను ఆశ్రయిస్తున్నారు. గ్రామంలో మంచినీటిని సరఫరా చేసే మోటార్ వద్ద కరెంట్ తీగలు తెగిపోవడం, పైపులైన్ పనులు జరుగుతుండడంతో తాగునీటి సమస్య ఏర్పడింది.

గ్రామంలో తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు బైకులు, తోపుడు బండ్లపై 2 కిలో మీటర్ల దూరంలోని బోర్లు, బావుల దగ్గర బిందెలతో నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు చేయిస్తున్నాం..

తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా మోటార్, బోరు పనిచేయక పోవడం, పైపులైన్ పనులు జరుగుతుండడంతో సమస్య ఏర్పడింది. మోటార్, కరెంట్ పనులు చేయిస్తున్నాం. పనులు అయిన వెంటనే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు.

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి



మొల్ల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం తాలూకా అధ్యక్షుడు నాడుగేని నాగరాజు

కోసిగి: కవయిత్రి శాలివాహన మొల్లమాంబ (కుమ్మరి మొల్ల) జీవితం బీసీలకు స్ఫూర్తిదాయకమని మంత్రాలయం నియోజకవర్గ బీసీ విభాగం వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నాడుగేని నాగరాజు అన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోసిగిలో ఎంపీపీ ఈరన్నలతో కలిసి కవయిత్రి మొల్ల జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు షంషుద్దీన్, ముకుంద కృష్ణమూర్తి, కాంట్రాక్టర్ నాగరాజు, బుల్లి నరసింహులు, గానిగ వీరస్వామి, కొరివి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

మంత్రాలయం : వైఎస్సార్‌సీపీ మండల కమిటీలను నియమిస్తూ ఆపార్టీ కేంద్రం కార్యాలయం గురువారం ఉత్తర్వులిచ్చింది. మండల ఉపాధ్యక్షులుగా టి. భీమయ్య, కె. వీరనాగప్ప, జనరల్ సెక్రైటరీగా కాంత రెడ్డి, రఘునాథ్ రెడ్డి, డి. నరసప్ప, ట్రెజరరీగా చంద్రశేఖర్, సెక్రటరీలుగా రాము, లక్ష్మన్న, జ్యోతి, లింగా రెడ్డి నియమితులయ్యారు.

కోసిగి మండలం

కోసిగి: వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడిగా కె. నరసన్న, ముకుంద కృష్ణమూర్తి, జనరల్ సెక్రైటరీగా గానిగ వీరస్వామి, కె.రహీమ్, ఏ. రామలింగ, కాల్వ వెంకట రెడ్డి, సెక్రటరీగా బుల్లి నరసింహులు, డి.లంకా రెడ్డి, వీరన్న గౌడ, బండ్ల గోవిందు, ఏ.పురుషోత్తం, ట్రెజరరీగా సునందరాజు ఎంపికయ్యారు.

కౌతాళం మండలం

కౌతాళం: వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులుగా చెన్నబసప్పధని, ఆర్.ఎం. సుధాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా నర్సప్ప, లింగన్నగౌడ్, షేక్ ఇద్రూస్‌బాషా, ప్రకాశ్, సెక్రటరీలుగా రమేష్, గురునాథ్‌రెడ్డి, నీలకంఠరెడ్డి, ధర్మన్న, ఎల్.లింగన్నగౌడ్‌లు, ట్రెజరర్‌గా బి.రాఘవేంద్రరెడ్డిలను పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది.

పెద్దకడబూరు మండల కమిటీ నియామకం

పెద్దకడబూరు: వైఎస్సార్ సీపీ మండల వైస్ ప్రెసిడెంట్లుగా గౌడ్ల నాగరాజు, బి.బత్తిని దేవదానము, జనరల్ సెక్రటరీలు గా బి.శివరాముడు, బజారప్పా, పింజరి దస్తగిరి, జి.హనుమంతరెడ్డి, సెక్రటరీలు గా ఈ.సురేష్‌గౌడ్, బి.శాంతిరాజు, షేర్‌ఖాన్ పటేల్, బి.కోతిపెద్దయ్య, బి.లక్ష్మన్న, ట్రెజరర్‌గా కే.చంద్రశేఖర్ ఆచారి నియమితులయ్యారు.

కారు, ట్రాక్టర్ ఢీ.. ఐదుగురికి గాయాలు

ఆదోని అర్బన్: ఎమ్మిగనూరు మండలం కోటేకల్ క్రాస్ వద్ద గురువారం రాత్రి కారు, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడగా, ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. ఔట్‌పోస్టు కానిస్టేబుల్ తెలిపిన మేరకు వివరాలు.. పట్టణానికి చెందిన సుప్రతనాయక్, నిజాముద్దీన్, శీను, అఖిల్ కారులో వెళ్తుండగా కోటేకల్ క్రాస్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ప్రమాదంలో నాగలాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్‌తో పాటు కారులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ఇందులో అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

వివాహిత ఆత్మహత్య

ఆదోని అర్బన్: పట్టణంలోని వాల్మీకినగర్‌కు చెందిన వివాహిత వాణి(20) గురువారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వెంటనే బంధువులు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు మెరుగైన చికిత్సల కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక వాణి మృతిచెందిందని ఔట్ పోస్టు కానిస్టేబుల్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆక్రమణలను తొలగించండి



షాపుల యజమానులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమలత

ఆదోనిఅర్బన్: ఆర్టీసీ బస్సులు తిరిగే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకున్న షాపులను తొలగించాలని డీఎస్పీ హేమలత ఆదేశించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి సెయింట్ జోసెఫ్ స్కూల్, శ్మశానవాటిక, తిక్కస్వామి దర్గా ప్రాంతాల్లోని రహదారులను డీఎస్పీ పరిశీలించారు. ఆ రహదారుల్లో బస్సులు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న షాపుల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల కట్టడికి పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. ఈమె వెంట ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, ఆర్టీసీ డీఎం, ఆర్‌అండ్‌బీ అధికారులు ఉన్నారు.

ఐదోరోజూ కొనసాగిన ఆక్రమణల తొలగింపు

పట్టణంలో మున్సిపల్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఐదో రోజు గురువారం అక్రమంగా ఏర్పాటు చేసుకున్న షాపుల తొలగింపు పనులు చేపట్టారు. పట్టణంలోని శ్రీనివాసభవన్ నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని ఉన్న షాపులను తొలగించి వాహనదారులకు, ట్రాఫిక్ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ట్రాపిక్ సీఐ గంటాసుబ్బారావు తెలిపారు.